క్లుప్తంగా

కృష్ణా కళాశాల గ్రంథాలయానికి వితరణ



భారత రాజ్యాంగ ప్రతిని అందిస్తున్న కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జయ

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రంథాలయానికి అదే కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ భారత రాజ్యాంగ ప్రతిని వితరణ చేశారు. కళాశాలలో బుధవారం ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయ బాబు, గ్రంథాలయాధికారి డాక్టర్ ఎం.శ్రీనివాస ప్రసాద్‌కు ఈ గ్రంథాన్ని ఆమె అందజేశారు. ఈ సందర్భంగా వారు వైస్ ప్రిన్సిపాల్ జయను అభినందించారు. విలువైన పుస్తకాన్ని విద్యార్థులకు అందుబాటులో ఉంచారన్నారు. కార్యక్రమంలో కె.రవిబాబు, ఎం.రాజేశ్వర రావు, డాక్టర్ పోలా ఉమామహేశ్వరరావు, ఎ.ఎల్.రూపవాణి, వి.సూర్యనారాయణ, ధన లక్ష్మి, సిహెచ్.లక్ష్మి, బి.పద్మ, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

కార్మిక విద్య, ఉపాధిపై అవగాహన



రామకృష్ణాపురం వాసులకు అవగాహన కల్పిస్తున్న కార్మిక విద్యా మండలి సభ్యుడు

ఆరిలోవ: కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో బుధవారం జీవీఎంసీ 13వ వార్డు రామకృష్ణాపురంలో కార్మిక విద్య, ఉపాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ–శ్రమ కార్డులు, వాటి ఉపయోగాలు, వాటిని వినియోగించడం, ఆయుష్మాన్ కార్డుల ఉపయోగాలు, ప్రధాన మంత్రి సురక్ష యోజన బీమా కార్డులు, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి శ్రమ యోగి మదన్ పెన్షన్ తదితర పథకాల గురించి స్థానికులకు వివరించారు. కార్యక్రమంలో కార్మిక విద్యాధికారి రెడ్డి నాగార్జున, ధరణి ప్రతినిధి బి.హరి, గ్రామ సంఘం అధ్యక్షుడు వంకర బాబూరావు, గౌరవాధ్యక్షుడు కాకర గోవిందు, మహిళలు పాల్గొన్నారు.

కాగడాల ప్రదర్శనను జయప్రదం చేయండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ ప్రాంగణంలో ఈ నెల 23న చేపట్టబోయే కాగడాల ప్రదర్శనను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ వర్సిటీ విభాగం కార్యదర్శి వెంకటరమణ పిలుపునిచ్చారు. సంఘ సభ్యులతో కలిసి బుధవారం ఏయూ ప్రాంగణంలో కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయుల గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ త్యాగాలను స్మరించుకునేలా 94వ వర్ధంతి సందర్భంగా కాగడాల ప్రదర్శన చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ విద్యార్థులంతా పాల్గొనాలని కోరారు.

విశిష్టమైనది స్పర్శ సిద్ధాంతం



మాట్లాడుతున్న తెలుగు ఆచార్యుడు వెంకటేశ్వర యోగి

సీతంపేట: ఆధ్యాత్మిక వేత్తల స్పర్శ శిష్యుల్లోని అజ్ఞానాన్ని పోగొట్టి జ్ఞాన దీప్తిని కలిగిస్తుందని ఏయూ తెలుగు ఆచార్యుడు డాక్టర్ ఆతుకూరి వెంకటేశ్వర యోగి అన్నారు. సహృదయ సాహితి ఆధ్వర్యంలో స్థానిక ప్రిజమ్ కళాశాలలో బుధవారం జరిగిన సాహిత్య కార్యక్రమంలో ఆయన ప్రధాన ప్రసంగం చేశారు. వైద్యుల స్పర్శ రోగికి ఉపశమనం కలిగిస్తుందని, తెలుగు, సంస్కృత కావ్యాల్లో స్పర్శ విశేషమని పేర్కొన్నారు. భారతీయ పవిత్ర దాంపత్యం ధర్మానికి గొప్ప విశ్లేషణగా నిలిచిందన్నారు. దంపతుల మధ్య ఉండే పవిత్రమైన స్పర్శ గుణాన్ని రామాయణం దగ్గర నుంచి అనేక కావ్యాలు గొప్పగా వర్ణించాయని చెప్పారు. తెలుగు సాహిత్యంలో విశ్వనాథ సత్యనారాయణ స్పర్శ సిద్ధాంతాన్ని 'తెరచి రాజు' అనే నవలలో ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. ఈ నవలలో కథానాయకుడు తనలోని శక్తిని స్పర్శ ద్వారా శిష్యుడిలోకి ప్రవేశపెడతాడన్నారు. స్పర్శ సిద్ధాంతం భారతీయ సాహిత్యంలో విశిష్ట స్థానం సంపాదించుకుందని తెలిపారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు శేఖరమంత్రి ప్రభాకర్, కె.జి.వేణు, డి.వి.సూర్యారావు పాల్గొన్నారు.

అద్దె గృహాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు

బుడి బుడి అడుగులు వేస్తూ.. బోసినవ్వులతో పలకా బలపం పట్టుకుని అక్షరాలు నేర్చుకునేందుకు వచ్చే చిన్నారుల తొలి విద్యాలయం అంగన్‌వాడీ కేంద్రం. పిల్లల ప్రాథమిక విద్యకు ఎంతో దోహదపడే అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు కరువయ్యాయి. అద్దె గృహాల్లో భవనాలు కరువయ్యాయి. అద్దె గృహాల్లో ఆపసోపాలు పడుతూ ప్రీ స్కూళ్ల నిర్వహణ కొనసాగిస్తున్నారు. పక్కా భవనాలు నిర్మిస్తామంటూనే ప్రభుత్వాలు కాలం వెళ్లదీస్తున్నాయే తప్ప.. ఆ దిశగా చర్యలు చేపట్టిన దాఖలాలు కనిపించడం లేదు. - మద్దిలపాలెం



కేఆర్ఎం కాలనీలోని అద్దె పెంకుటింట్లో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం



ఇరుకు గదిలో కూర్చున్న చిన్నారులు



అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్న గదిలో వంటశాల

అసౌకర్యాల నడుమ ప్రీ స్కూళ్ల నిర్వహణ

ఇరుకు గదుల్లో చిన్నారుల చదువులు

అరకొర సదుపాయాలతో అవస్థలు

అంగన్‌వాడీ కేంద్రాలు విశాలంగా ఉంటే.. అక్కడికి వచ్చే చిన్నారులు విద్యాబుద్ధులు నేర్చుకునేందుకు ఆసక్తి చూపిస్తారు. ప్రభుత్వాలు సొంత భవనాల నిర్మాణం ఊసే ఎత్తకపోవడంతో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు అంగన్‌వాడీ కేంద్రాలున్న చోట అద్దె గృహాలను తీసుకుని నడుపుతున్నారు. ఇరుకు గదుల్లో చాలీచాలని వసతుల నడుమ చిన్నారుల విద్యాభ్యాసం సాగుతోంది.

మద్దిలపాలెం సెక్టార్‌లో మూడింటికే భవనాలు

మద్దిలపాలెం సెక్టార్ పరిధిలోని 15, 16, 23 వార్డుల్లో మాతా శిశు సంక్షేమ శాఖకు చెందిన 24 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో కేవలం మూడంటే మూడింటినే ప్రభుత్వ భవనాల్లో నిర్వహిస్తున్నారు. మిగిలిన 21 కేంద్రాలు అద్దె గృహాల్లో అసౌకర్యాల మధ్య నడుస్తున్నాయి. 16వ వార్డు ఇసుకతోట రజక వీధిలోని కమ్యూనిటీ హాల్ పక్కన ప్రభుత్వ భవనంలో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్నారు. ఇదే వార్డు అంబేడ్కర్ నగర్‌లోని ఇసుకతోట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో అంగన్‌వాడీ కేంద్రం, చైతన్యనగర్ కాలనీలోని జీవీఎంసీ స్కూల్ భవనంలో మరో అంగన్‌వాడీ కేంద్రం ఉన్నాయి.

21 కేంద్రాలు అద్దె గృహాల్లోనే..

సెక్టార్ పరిధిలోని 21 అంగన్‌వాడీ కేంద్రాలను అద్దె గృహాల్లో నడుపుతున్నారు. వీటిలో చాలా వరకు ఇరుకు గదులే. వాటిలోనే చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పుతున్నారు. మరో గదిలో స్టాక్‌లు పెట్టుకున్నారు. ఇంకో గది ఉంటే వంటగదిగా వాడుకుంటున్నారు. ఇలా మూడు గదులు లేకపోతే ఉన్న గదుల్లోనూ అరకొర వసతుల మధ్య ఇబ్బంది పడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నారు.

పెంకుటింట్లో ప్రీ స్కూల్

జీవీఎంసీ 16వ వార్డు కేఆర్ఎం కాలనీలోని ఓ అంగన్‌వాడీ కేంద్రం అద్దె పెంకుటింట్లో ఉంది. దీనిలో మూడు చిన్న గదులున్నాయి. ఒక గదిలో విద్యా బోధన, మరో గదిలో స్టాక్, చివరి గదిని వంటశాలగా వినియోగిస్తున్నారు. ఈ ప్రీ స్కూల్‌కు వచ్చే 20 మంది చిన్నారులకు చిన్న గదిలోనే విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారు. విశాలమైన గదులు లేకపోవడంతో పిల్లలు ఇక్కట్లకు గురవుతున్నారు.

గదులు చాలక ఇబ్బందులు

కేఆర్ఎం కాలనీలోని ఈ చిన్న గదిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం నుంచి ప్రతి నెలా 110 మంది చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నారు. వీరితోపాటు 32 మంది బాలింతలు, గర్భిణులున్నారు. 7 నెలల నుంచి 3 ఏళ్ల లోపు గల 110 మంది పిల్లలకు అందించే పౌష్టికాహార సామగ్రి ఉంచేందుకు చిన్న గదులు చాలక ఇబ్బంది పడుతున్నారు. రోజూ అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే 3 ఏళ్ల నుంచి 6 ఏళ్ల లోపు వయసు గల 20 మంది చిన్నారులకు మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని కేంద్రంలోనే వండి వడ్డించాలి. ఇలా చేయడానికి చిన్న గదులు కావడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు కేటాయించాలని, ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

కొత్త అంగన్‌వాడీ కేంద్రాలు నిర్మించాలి

అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు కేటాయించాలి. చిన్నారుల కోసం అన్ని వసతి సదుపాయాలు కల్పించాలి. ఆట ఆడుకునేందుకు వీలుగా స్థలం ఉండాలి. అప్పుడే అంగన్‌వాడీ కేంద్రాల లక్ష్యం నెరవేరుతుంది.

– కె.ఈశ్వరి, కేఆర్ఎం కాలనీ

ప్రీ స్కూళ్లను బలోపేతం చేయాలి

పిల్లల తొలి పాఠశాలలైన అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలి. చిన్నారుల విద్యపై ఆసక్తి రేపేలా భవనాలు నిర్మించాలి. అన్ని సదుపాయాలు కల్పించాలి. అప్పుడే చిన్నారులు ప్రీ స్కూళ్లకు వచ్చేందుకు ఆసక్తి చూపిస్తారు.

– కె.రమాప్రభ, కేఆర్ఎం కాలనీ

పరీక్ష కేంద్రాల వద్ద ట్రాఫిక్ సమస్య



టీఐసీ పాయింట్ వద్ద రెండు పరీక్ష కేంద్రాల నుంచి వచ్చిన విద్యార్థులు, వాహనాలతో రద్దీ

ఆరిలోవ: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రెండో రోజు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. ఆరిలోవ టీఐసీ పాయింట్ వద్ద హిందీ కాలేజీ సమీపంలో ఎదురెదురుగా 50 మీటర్ల దూరంలోనే రెండు ప్రైవేట్ స్కూళ్లలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ సెంటర్లలో 400 మందికి పైగా విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతున్న పరీక్షలకు విద్యార్థులను తీసుకొని వారి తల్లిదండ్రులు వస్తున్నారు. ప్రధాన రహదారి అయినప్పటికీ ఇరుకు రోడ్డు కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులతో ఉదయం 9 గంటల నుంచే రద్దీగా మారుతోంది. దీంతో ఇక్కడ వాహనాల రాకపోకల సమస్య తలెత్తుతోంది. సహజంగా పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. పోలీసులు కేంద్రాల వద్ద విధులు నిర్వహించాల్సి ఉంది. పోలీసులు ఎవ్వరూ ఈ కేంద్రాల వద్ద కానరావడం లేదు. దీంతో 144 సెక్షన్‌ను గాలికి వదిలేయడంతో పాటు ఇక్కడ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. విద్యార్థులు ఆయా కేంద్రాల్లో పరీక్షకు వెళ్లి, రాసి వచ్చే సమయాల్లో ఈ సమస్యతో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. పరీక్షలు ముగిసే సమయంలో ఇక్కడ పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

మందుబాబులకు జరిమానా

గోపాలపట్నం: మద్యం సేవించి వాహనం నడిపిన కేసుల్లో ఐదుగురికి 2వ తరగతి స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కె. మురళీకృష్ణ రూ.50వేలు జరిమానా విధించారు. గోపాలపట్నం ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మార్చి నెలలో నమోదైన కేసుల్లో జరిమానాతో పాటు నాలుగు రోజులు జైలు శిక్ష విధించారు.

డాక్టర్ పెమ్మరాజు శ్రీనివాసరావుకు నివాళి



డాక్టర్ పెమ్మరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ సీతామాణిక్యం, ఆచార్యులు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల పూర్వ విద్యార్థి డాక్టర్ పెమ్మరాజు శ్రీనివాసరావు సంతాప సభ బుధవారం నిర్వహించారు. న్యాయ కళాశాల సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏయూలో న్యాయ విద్యను అభ్యసించిన డాక్టర్ శ్రీనివాసరావు ఇంటర్నేషనల్ కోర్ట్ ఆఫ్ జస్టిస్ ఎడ్‌హక్ జడ్జిగా, ఇంటర్నేషనల్ లా కమిషన్ సభ్యుడిగా, ఖతార్ అటార్నీ జనరల్ కార్యాలయం ప్రత్యేక సలహాదారుడిగా సేవలందించి ఏయూకు ఎంతో పేరు తీసుకొచ్చారని న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతామాణిక్యం కొనియాడారు. కార్యక్రమంలో ఆచార్య నాగార్జున వర్సిటీ మాజీ వీసీ ఆచార్య ఎ.రాజేంద్రప్రసాద్, ఆచార్య ఎస్.సుమిత్ర, ఆచార్య వి.రాజ్యలక్ష్మి, ఆచార్య చంద్రకళ, డాక్టర్ పల్లవి, డాక్టర్ ప్రసాద్, ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఎన్ఆర్ నగర్‌లో నీటి సమస్య తీర్చాలి




స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నాయకుడు కుమార్

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు తోటగరువు దరి బీఎన్ఆర్ నగర్‌లో నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్.కె.ఎస్.వి.కుమార్ అధికారులను కోరారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన చైతన్య యాత్రలో భాగంగా బుధవారం ఆయన స్థానిక సీపీఎం నాయకులతో కలిసి బీఎన్ఆర్ నగర్‌లో పర్యటించారు. నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కుమార్ మాట్లాడుతూ బీఎన్ఆర్ నగర్ కొండపై నివసిస్తున్న వారంతా పేదలేనన్నారు. సుమారు 15 ఏళ్లుగా కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారని చెప్పారు. ఇక్కడ నీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. స్థానిక ఎమ్మెల్యే, జీవీఎంసీ అధికారులు ఇక్కడి కొండపై ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. యూజీడీ సౌకర్యం, అంగన్‌వాడీ కేంద్రం, రక్షణ గోడలు లేకపోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. ఇక్కడ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు డి.నాగరాజు, ఎ.రమణ, గురుమూర్తి, రాము, మణి పాల్గొన్నారు.

సీపీఎం జన చైతన్య యాత్ర

ఏయూక్యాంపస్: జీవీఎంసీ 21వ వార్డు చినవాల్తేరు రెల్లి వీధి ప్రాంతంలో సీపీఎం వాల్తేర్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం జన చైతన్య యాత్ర నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు స్థానికుల ఇంటింటికీ వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా డ్రైనేజీ సమస్య ఉందని, తరచూ పొంగుతోందని, వీధి కుళాయిలు మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో ఇస్తున్నారని, వీటిని ఉదయం వేళలో ఇవ్వాలని కోరారు. సచివాలయం, జీవీఎంసీ అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లినా పరిష్కారం కావడం లేదన్నారు. మ్యాన్‌హోల్ పొంగి మురుగునీరు, దుర్వాసన వస్తున్నాయన్నారు. తల్లికి వందనం, ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందడం లేదని వీరు తెలిపారు. కరెంట్ చార్జీలు గణనీయంగా పెంచారని, డిగ్రీ విద్యార్హత కలిగిన యువతకు ఉపాధి అవకాశాలు లభించక చిరుద్యోగాలు చేసుకుంటున్నారన్నారు. దళిత కాలనీలో 200 యూనిట్లు ఉచితంగా కరెంట్ ఇవ్వాలని, రెల్లి వీధిలో ఇది అమలు కావడం లేదన్నారు. వీటిపై రెల్లివీధిలో ప్రజలతో సంతకాలు సేకరించారు. త్వరలో ప్రజలందరితో కలసి పోరాటం చేస్తామని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో వాల్తేరు శాఖ కార్యదర్శి పి.వెంకటరావు, పార్టీ నాయకులు దండు నాగేశ్వరరావు, చలపతి, అనపర్తి అప్పారావు, కె.కుమారి, ఎం.చంటి తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారిపై వాహనాల పార్కింగ్



టీఐసీ పాయింట్ హిందీ కాలేజీ ఎదురుగా ప్రధాన రహదారిపై వాహనాల పార్కింగ్

ఆరిలోవ: ఆరిలోవలో పలుచోట్ల ప్రధాన రహదారిపై వాహనాలు నిలుపుతున్నారు. ఇక్కడి రోడ్లనే కొంత మంది పార్కింగ్ స్థలంగా వినియోగించుకుంటున్నారు. టీఐసీ పాయింట్ నుంచి హిందీ కాలేజీ వరకు ప్రధాన రహదారిపైనే వ్యాన్‌లు, ఆటోలు నిలిపి ఉంచుతున్నారు. రాత్రి వేళ వీటిని నిలిపి మరుసటి రోజూ ఉదయం 9 గంటల వరకు తీయడంలేదు. దీంతో ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. ఈ రహదారిపై నగరం నుంచి ఆరిలోవకు 60సీ, 69 సిటీ బస్‌లు నిత్యం తిరుగుతుంటాయి. వాటితోపాటు వందల సంఖ్యలో ఆటోలు, కార్లు ఉదయం 5 గంటల నుంచే రాకపోకలు సాగిస్తాయి. సుమారు 20 అడుగుల రోడ్డు లోని సగ భాగంలో వాహనాలు నిలిపేస్తున్నారని, దీని వల్ల ఇబ్బంది పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. వీటిని వేరే చోట పార్కింగ్ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

17 మంది స్టాఫ్ నర్సులకు ట్యూటర్లుగా పదోన్నతి

మహారాణిపేట: వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయ పరిధిలోని 17 మంది స్టాఫ్ నర్సులకు నర్సింగ్ కాలేజీ, స్కూళ్లలో ట్యూటర్లుగా పదోన్నతి లభించింది. ఆరోగ్య శాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ పి.రాధా రాణి, డిప్యూటీ డైరెక్టర్ అంజయ్య, ఆఫీస్ సూపరింటెండెంట్ రామ్మోహనరావు ఆధ్వర్యంలో బుధవారం వారికి ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. అభ్యర్థులు ఎంపిక చేసుకున్న ప్రాంతాలకు పదోన్నతితో కూడిన బదిలీ ప్రక్రియ పూర్తి చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాధారాణి మాట్లాడుతూ పదోన్నతులు పొందిన వారంతా నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ఏపీ నర్సింగ్ అసోసియేషన్ విశాఖ జిల్లా యూనిట్ కార్యదర్శి జి.వి.ఎస్. వరలక్ష్మి, వైస్ ప్రెసిడెంట్ ఇందిర మాట్లాడుతూ పారదర్శకంగా పదోన్నతులు జరిగాయన్నారు.

రెచ్చిపోతున్న కాపర్ దొంగలు

- ఎంవీపీలో 15 చోట్ల డ్రిల్లింగ్ చేసి మరీ చోరీ
- గోప్యత పాటిస్తున్న క్రైం పోలీసులు



ఎంవీపీ డబుల్ రోడ్డులో కాపర్ వైర్ల కోసం తవ్విన గొయ్యి



ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలో కొంతకాలంగా కాపర్ వైర్ల దొంగలు రెచ్చిపోతున్నారు. పక్కా సమాచారంతో అండర్ గ్రౌండ్ డ్రిల్లింగ్ చేపట్టి మరీ కాపర్‌ను దోచుకుంటున్నారు. గుట్టుచప్పుడు కాకుండా రాత్రి పూట జరుగుతున్న ఈ క్రైం బీఎస్ఎన్ఎల్ సంస్థ ల్యాండ్‌లైన్ సేవలకు కలిగిన విఘాతం కారణంగా బయటకొచ్చింది. కాపర్ కోసం కొందరు తవ్వుతున్న గుంతల కారణంగా బీఎస్ఎన్ఎల్ ల్యాండ్‌లైన్ సేవలకు విఘాతం కలిగినట్లు ఆ సంస్థ ఉద్యోగులు గుర్తించారు. అనంతరం ఎంవీపీ క్రైం పోలీసులకు దీనిపై వారు సమాచారం అందించారు. ఈ వ్యవహారంపై నిఘా పెట్టిన క్రైం పోలీసులు ఈ నెల 9న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఈ సమాచారం బయటకు పొక్కకుండా క్రైం పోలీసులు గోప్యత పాటించడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై క్రైం పోలీసులు నుంచి సమాచారం తెలుసుకునేందుకు 'సాక్షి' ప్రయత్నించగా.. ఎవరూ అందుబాటులోకి రాలేదు.

గోప్యత వెనుక రహస్యమేంటి..?

ఈ నెల 5 నుంచి కొందరు వ్యక్తులు ఎంవీపీ కాలనీ డబుల్ రోడ్డులోని ఐఐఎం ఎదుట రహదారిలో డ్రిల్లింగ్ చేసి కాపర్ కోసం రాత్రి పూట తవ్వుతున్నారు. ఈ క్రమంలో కొన్ని బీఎస్ఎన్ఎల్ ల్యాండ్ లైన్ వైర్లు తెగిపోతున్నాయి. వినియోగదారుల ఫిర్యాదులతో సంస్థ సిబ్బంది పరిశీలించగా.. ఈ తవ్వకాల వ్యవహారం బయటకొచ్చింది. వెంటనే వారు క్రైం పోలీసులకు సమాచారమిచ్చారు. అనంతరం వారు నిఘా పెట్టగా.. ఏలూరుకు చెందిన కొందరు వ్యక్తులు ఈ తవ్వకాలకు పాల్పడినట్లు తెలిసింది. ఐఐఎం ఎదుటి నుంచి జీవీఎంసీ స్పోర్ట్స్ ఎరీనా వరకు 15 చోట్ల వీరు తవ్వకాలు చేసినట్లు సమాచారం. ఈ నెల 9న తవ్వకాలకు పాల్పడుతున్న ఏడుగురిని క్రైం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం బీఎస్ఎన్ఎల్ అధికారులకు సమాచారం ఇవ్వగా.. సబ్ డివిజనల్ ఇంజినీర్ స్థాయి అధికారి ఫిర్యాదుతో వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిసింది. ఈ సమాచారం బయటకు పొక్కకుండా ఎంవీపీ క్రైం పోలీసులు గోప్యత పాటించడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాపర్‌పై పక్కా సమాచారంతో వీరు ఎలా తవ్వకాలు చేస్తున్నారు? ఇన్ని రోజులుగా తవ్వకాలు చేసి రూ.లక్షలు విలువచేసే కాపర్ కాజేస్తుంటే జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం, ఎలక్ట్రికల్ విభాగం అధికారులు ఎందుకు ప్రశ్నించలేదు? ఈ వ్యవహారాన్ని బయటకు పొక్కకుండా క్రైం పోలీసులు ఎందుకు గోప్యంగా ఉంచారు? అనే ప్రశ్నలు ప్రస్తుతం ఎంవీపీ కాలనీలో సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. పక్కా సమాచారంతోనే డ్రిల్లింగ్ చేసి కాపర్ దొంగిలిస్తున్నట్లు అంతా అభిప్రాయపడుతున్నారు. బీఎస్ఎన్ఎల్, ఎలక్ట్రికల్ విభాగం అధికారులు కచ్చితంగా వీరికి సహకారం అందిస్తున్నట్లు చర్చ జరుగుతోంది. ఇందులో భాగంగానే క్రైం పోలీసులు ఈ వ్యవహారాన్ని గోప్యంగా ఉంచుతున్నట్లు ఆరోపిస్తున్నారు.

23న బాడీ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక

సీతంపేట: రామాటాకీస్ ఎదురుగా గల వాయుపుత్ర హెల్త్ క్లబ్‌లో ఈ నెల 23వ తేదీ ఉదయం 10 గంటలకు ఆంధ్రా బాడీ లిఫ్టింగ్ జట్టును ఎంపిక చేయనున్నట్టు ఆంధ్రా బాడీ లిఫ్టింగ్ సంఘం ప్రెసిడెంట్ ఎస్.ఎస్.శివశంకర్ పక ప్రకటనలో తెలిపారు. 55, 60, 65, 70, 75, 80, 85, 90 కిలోల సీనియర్స్ విభాగంలో వేర్వేరుగా ఎంపికలు జరుగుతాయని చెప్పారు. మాస్టర్స్ విభాగంలో 40, 45, 50, 55, 60 ఏళ్లు దాటిన కేటగిరీల్లో, దివ్యాంగులకు 65 కిలోల లోపల, 65 కిలోలపైన రెండు విభాగాల్లో ఎంపికలు ఉంటాయన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఏపీ తరఫున వచ్చే నెల 26, 27 తేదీల్లో పంజాబ్ రాష్ట్రం జలంధర్‌లో జరగనున్న 15వ జాతీయ బాడీ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి గలవారు ఆధార్ కార్డు జెరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో వాయుపుత్ర హెల్త్ క్లబ్‌కు హాజరు కావాలన్నారు. వివరాలకు 88852 03519 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

హాయ్.. ఐయామ్ కుసుమ



పెదవాల్తేరు బయోడైవర్సిటీ పార్క్‌లో ఆకర్షిస్తున్న కుసుమ చెట్టు

హాయ్.. నమస్తే వైజాగ్ సిటిజన్స్. ఐయామ్ కుసుమ. వృక్ష జాతికి చెందిన నా శాస్త్రీయ నామం ష్లీచెరా ఒలియోసా. ప్రకాశవంతమైన ఎరుపు, గులాబీ రంగుల పువ్వులాంటి ఆకులతో ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తాను. నేను ఉష్ణ మండలంలో ఒక పెద్ద చెట్టుని. దాదాపు 30 మీటర్ల ఎత్తు వరకు పెరుగుతాను. పెదవాల్తేరు బయోడైవర్సిటీ పార్క్‌లో మీరు నన్ను చూడవచ్చు. నేను చాలా సొగసైన, అందమైనదానిని. నా పాత ఆకులు రాలిపోయి కొత్తవి వచ్చినపుడు మరింత ఆకర్షణీయంగా ఉంటాను. నా విత్తనాల్లో ఉండే నూనెను కుసుమ నూనె అని పిలుస్తారు. జుట్టు సంరక్షణకు, లైటింగ్ కోసం ఇంధనంగా వినియోగిస్తారు. నా విత్తనాలు ఒక్కొక్కటి 3 సెం.మీ. పెద్ద పండ్లలో పెరుగుతాయి. గుజ్జు కొద్దిగా పుల్లని రుచిని కలిగి ఉంటుంది. నా జాతి ఎక్కువగా భారతదేశం, శ్రీలంక, థాయిలాండ్, ఇండోనేషియా దేశాల్లోని పొడి, బహిరంగ ప్రాంతాల్లో కనిపిస్తుంది. నిద్రాణమైన కాలం తర్వాత నేను పూర్తిగా ఎరుపు రంగులోకి మారుతాను. నా కలప ఎరుపు–గోధుమ రంగును కలిగి ఉంటుంది. చాలా మన్నికైనదాన్ని. నా బెరడు మలేరియా, చర్మ సమస్యలకు సహా ఔషధ ఉపయోగాలను కలిగి ఉంటాను. ఇన్ని ప్రత్యేకతలు కలిగిన ఈ కుసుమ చెట్టు విశేషాలను బయోడైవర్సిటీ పార్క్ నిర్వాహకుడు ఎం.రామామూర్తి సందర్శకులకు తెలియజేస్తున్నారు. – బీచ్‌రోడ్డు



ఆరిలోవ హెల్త్‌సిటీ బీఆర్‌టీఎస్ రోడ్డులోని చెట్లు అందరినీ కనువిందు చేస్తున్నాయి. డివైడర్‌పై నాటిన చెట్లు వేసవి సమయంలోను పింక్ కలర్ పువ్వులతో అందంగా దర్శనమిస్తున్నాయి.

ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం